# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-04-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ రేపు తిరుపతిలో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు.**

2. **వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పులివెందులలో ఈరోజు నామినేషన్ దాఖలు చేశారు.**

3. **ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్ష, రీ-కౌంటింగ్, రీ-వెరిఫికేషన్‌కు రుసుము చెల్లించే గడువును ఈ నెల 30 వరకు ఇంటర్ బోర్డు పొడిగించింది.**

4. **బ్యాంకింగ్ మార్గాల ద్వారా అనధికారిక విదేశీ మారకపు లావాదేవీలను నిరోధించేందుకు, మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులను ఆదేశించింది.**

5. **ఐ.పి.ఎల్‌లో భాగంగా హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య ఈరోజు మ్యాచ్ జరగనుంది.**

========================

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ రేపు తిరుపతి, తిరుమలలో పర్యటించనున్నారు. రేపు ఉదయం 10 గంటల 30 నిమిషాలకు తిరుపతి విమానాశ్రయం చేరుకోనున్న ఉపరాష్ట్రపతి నేరుగా తిరుమలకు వెళ్లి వెంకటేశ్వరస్వామిని దర్శించుకోనున్నారు. అనంతరం తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం చేరుకుని 3వ స్నాతకోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. స్నాతకోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ ఉపకులపతి జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి ఆకాశవాణికి తెలిపారు. 67 మందికి బంగారు పతకాలు, 580 మంది విద్యార్థులకు పట్టాలను ఉపరాష్ట్రపతి ప్రదానం చేయనున్నట్లు ఉపకులపతి తెలిపారు.

------------------------

ఒకప్పుడు కరువు ప్రాంతంగా పేరున్న వైఎస్ఆర్ జిల్లా పులివెందులకు.. ఇప్పుడు కృష్ణా జలాలు వస్తున్నాయని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అన్నారు. నామినేషన్ దాఖలు చేసేందుకు ఈ ఉదయం ఆయన పులివెందుల చేరుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. పులివెందుల అంటే అభివృద్ధి, నమ్మకం, ఒక విజయగాథగా పేర్కొంటూ.. ఈ అభివృద్ధికి కారణం వైఎస్ రాజశేఖరరెడ్డి అని తెలిపారు. ఆయన చూపిన బాటలో తమ ప్రభుత్వం పురోగతి సాధించిందని అన్నారు. అనంతరం ఆయన పులివెందుల మినీ సెక్రటేరియేట్‌లోని రిటర్నింగ్ అధికారి

కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు.

---------------------------

గడిచిన ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి దూరమైందని భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. రాష్ట్రాభివృద్ధికి తాము ఎంతో సహకరించామని దానిని అందుపుచ్చుకోవడంలో జగన్మోహన్ రెడ్డి విఫలమయ్యారని తెలిపారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి నీరు, ఒకే దేశం–ఒకే రేషన్ ద్వారా దేశంలో ఎక్కడైనా రేషన్ పొందేందుకు అవకాశం, పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు భారీగా కేటాయింపులు చేశామని పీయూష్ గోయల్ వివరించారు.

అంతకుముందు తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతో గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ఆయన నివాసంలో పీయూష్ గోయల్ సమావేశమయ్యారు. టిడిపి, బీజేపీ, జనసేన పార్టీ ఉమ్మడి కార్యాచరణ, మ్యానిఫెస్టోపై ఈ సందర్భంగా చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటన ఖరారైన నేపథ్యంలో ఆయన పాల్గొనవలసిన బహిరంగ సభలు, ఎన్నికల ప్రచారాలపై సమాలోచనలు జరిపారు.

---------------------------

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షులు కె.పవన్ కల్యాణ్ ఈ రోజు అన్నమయ్య జిల్లాలో సంయుక్తంగా ప్రచారం నిర్వహించనున్నారు. రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని రాజంపేట, రైల్వే కోడూరు నియోజకవర్గాల్లో ఈ రోజు జరగనున్న ప్రజాగళం సభల్లో వారిద్దరూ పాల్గొంటారు. ఈ సభలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను టీడీపీ, జనసేన పార్టీల నేతలు పూర్తి చేశారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికలు నిర్వహణకు ఎన్నికల కమిషన్ నియమించిన సాధారణ, శాంతి భద్రతల పరిరక్షణ పరిశీలకులు ప్రమోద్ కుమార్ మెహర్ద, నయీం ముస్తఫా మన్సూరి లను పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఈరోజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛగా ప్రశాంతంగా నిర్వహణకు అమలు చేస్తున్న ప్రణాళిక, సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద తనిఖీలు, పటిష్ట నిఘా, తదితర అంశాలపై వివరించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టామని తెలిపారు. కచ్చితమైన ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుతో పాటు, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు అనుసరించాల్సిన విధానంపై చర్చించారు.

---------------------------

ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష, రీ–కౌంటింగ్, రీ–వెరిఫికేషన్‌కు రుసుము చెల్లించే గడువును ఈ నెల 30 వరకు ఇంటర్ బోర్డు పొడిగించింది. తొలుత ఇచ్చిన గడువు బుధవారంతో ముగియగా.. తాజాగా పొడిగించారు. మరోసారి అవకాశం ఉండదని స్పష్టం చేసింది.

---------------------------

బ్యాంకింగ్ మార్గాల ద్వారా అనధికారిక ఫారెక్స్- విదేశీ మారకపు లావాదేవీలను నిరోధించేందుకు, మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా -ఆర్.బీ.ఐ. బ్యాంకులను ఆదేశించింది. అటువంటి కేసులను వెంటనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కి నివేదించాలని తెలిపింది. అధిక రాబడి వస్తుందంటూ దేశీయులకు కొన్ని అనధికారిక సంస్థలు ఫారెక్స్ వ్యాపార సౌకర్యాలను అందిస్తున్న సందర్భాలు తమ దృష్టికి వచ్చినట్లు ఆర్‌బీఐ వివరించింది.

---------------------------

ఐ.పి.ఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య ఈ రోజు మ్యాచ్ జరగనుంది. ఈ సందర్భంగా స్టేడియం పరిసరాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మ్యాచ్ దృష్ట్యా ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్టు రాచకొండ సీపీ తరుణ్‌జోషి పేర్కొన్నారు.

---------------------------

దేశంలో రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిల ఆరోపించారు. విజయవాడలో ఈరోజు ఆమె న్యాయ్ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. రాజధాని పేరుతో రైతుల నుంచి వేలాది ఎకరాల భూములు సేకరించిన ప్రభుత్వాలు వారిని పట్టించుకోలేదని విమర్శించారు. గడిచిన పదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అన్నట్టుగా ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు నాయుడు, 2019 నుంచి ఇప్పటి వరకు జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం తిరోగమనంలో కొనసాగుతోందని షర్మిల ఆగ్రహం వ్యక్తంచేశారు.

---------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 91001 21702 ఫోన్ నంబరు సంప్రదించాలని సూచించారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, గ్రామాల్లోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

---------------------------

అర్హులైన ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని ప్రకాశం జిల్లా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ అన్నారు. దర్శి మండలంలోని అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన రాజంపల్లి, తూర్పు వీరాయపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఓటర్ల అవగాహనా కార్యక్రమాలలో జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌తో కలిసి నిన్న ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోందని అన్నారు. అర్హులందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ మాట్లాడుతూ, పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా భద్రతాపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.. స్థానికుల్లో ధైర్యం నింపేలా ఇప్పటికే గ్రామస్థాయిలో పోలీస్ కవాతు కూడా నిర్వహించామని తెలిపారు.

---------------------------

చిత్తూరు జిలాలో మే ఒకటో తేదీ నుంచి ఆరో తేదీ వరకు ఓటర్లకు బీఎల్‌వోల ద్వారా ఓటరు స్లిప్పులు పంపిణీ చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. కలెక్టరేట్‌లో నిన్న జరిగిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. నూతన ఓటరు నమోదు, మార్పు/చేర్పులు చేసుకున్న ఓటర్లకు సంబంధించి ఆరు వేల ఎపిక్ కార్డులు ఈ నెల 29న జిల్లాకు రానున్నట్లు తెలిపారు. ఇంటి నుంచి ఓటుపై సర్వే జరుగుతోందని, 1950కి ఫోన్ చేసి ఓటరు కార్డు సమాచారాన్ని తెలుసుకోవచ్చని చెప్పారు. పీవో, ఏపీవో, ఓపీవోలకు మే 3 నుంచి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని, మే 5న ఆర్‌వోల సమక్షంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి వివరించారు.

---------------------------

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం బీఈడీ ప్రవేశాలకు ప్రకటన విడుదలైంది. ఈ రోజు నుంచి ఈనెల 30వ తేదీ వరకు వెబ్ఆప్షన్, ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని వర్సిటీ అభ్యాసక సహాయ సేవా విభాగం డైరెక్టర్ ఎల్.కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 5న యూనివర్సిటీ నిర్వహించిన ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణులైనవారు మాత్రమే ప్రవేశాలు పొందడానికి అర్హులని పేర్కొన్నారు. ప్రవేశాలు పొందిన అభ్యర్థుల జాబితా మే 8న ప్రకటిస్తామని తెలిపారు.మరిన్ని వివరాలకు www.braouonline.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

---------------------------

తిరుమలలో యాత్రికుల రద్దీ సాధారణంగా ఉంది. శ్రీవారి దర్శనం కోసం 7 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. నిన్న 64 వేల మంది స్వామివారిని దర్శించుకోగా కానుకల రూపంలో 2 కోట్ల 66 లక్షల రూపాయల హుండీ ఆదాయం లభించింది.

=====================